## స్కేటింగ్ క్రీడాకారుడికి మాజీ మంత్రి అభినందన



స్కేటింగ్ క్రీడాకారుడు విశ్వతేజను అభినందిస్తున్న మాజీ మంత్రి, ఎమ్మెల్యే గంగుల కమలాకర్

కొత్తపల్లి/హౌసింగ్‌బోర్డు కాలనీ, ఏప్రిల్ 18: హైదరాబాద్‌లోని హకీంపేట ఎయిర్‌ఫోర్స్ అకాడమీ కేంద్రీయ విద్యాలయంలో ఇటీవల జరిగిన 54వ రీజినల్ స్కేటింగ్ పోటీల్లో పాల్గొని పతకాలు సాధించిన తాటి విశ్వతేజను మాజీ మంత్రి, కరీంనగర్ ఎమ్మెల్యే గంగుల కమలాకర్ ఆయన కార్యాలయంలో శుక్రవారం అభినందించారు. కరీంనగర్ కేంద్రీయ విద్యాలయంలో చదువుతున్న తాటి విశ్వతేజ మూడు విభాగాల్లో పోటీపడి బంగారు, రెండు రజత పతకాలు కైవసం చేసుకొని అక్టోబర్‌లో చెన్నైలో జరిగే జాతీయ స్కేటింగ్ పోటీలకు అర్హత సాధించాడు. అలాగే కేంద్ర హోంశాఖ సహాయమంత్రి బండి సంజయ్, కేంద్రీయ విద్యాలయ ప్రిన్సిపాల్, తదితరులు అభినందించారు.

## మాజీ ఎమ్మెల్యే పరామర్శ



రామయ్య చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న మాజీ ఎమ్మెల్యే రవిశంకర్

గంగాధర, ఏప్రిల్ 18: మండలంలోని కొట్టురుసింహుపల్లి గ్రామానికి చెందిన కాంగ్రెస్ పార్టీ నాయకులు రామిల్ల భాస్కర్, రామిల్ల రవి తండ్రి రామయ్య మృతి చెందగా, మాజీ ఎమ్మెల్యే సుంకె రవిశంకర్ శుక్రవారం బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. మృతికి కారణాలు తెలుసుకుని ప్రగాఢ సానుభూతిని తెలిపారు. రామయ్య చిత్ర పటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో నాయకులు దూలం శంకర్‌గౌడ్, ఇరుగురాల రవి తదితరులు ఉన్నారు.

## 'కార్మికుల హక్కులను కాలరాస్తున్న కేంద్రం'

తెలంగాణచౌక్, ఏప్రిల్ 18: కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం కార్మికుల హక్కులను కాలరాస్తున్నదని తెలంగాణ బిల్డింగ్ అండ్ అదర్ కన్‌స్ట్రక్షన్స్ వర్కర్స్ ఫెడరేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రత్నాకరం కొటంరాజ్ విమర్శించారు. నగరంలోని సీఐటీయూ కార్యాలయంలో శుక్రవారం జిల్లా కేంద్రంలో ఆ యూనియన్ సర్వసభ్య సమావేశంలో ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటి నుంచి కార్మిక, కర్షక వ్యతిరేక విధానాలు అవలంభిస్తున్నదని ఆరోపించారు. సమ్మెహక్కు, పని భద్రత, కనీస వేతనం, సామాజిక భద్రత లాంటి అంశాలు లేకుండా లేబర్ కోడ్ విధానం ఉందని విమర్శించారు. కార్మికుల మీద కక్ష పూరితంగా వ్యవహరిస్తున్న కేంద్ర ప్రభుత్వ నిర్ణయాలకు వ్యతిరేకంగా మే 20న తలపెట్టిన సార్వత్రిక సమ్మెలో అన్ని కార్మిక సంఘాలు పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. సమావేశంలో సీఐటీయూ జిల్లా కార్యదర్శి ఎడ్ల రమేశ్, నాయకులు తిరుపతి, శ్రీనివాస్, సంపత్, రాజయ్య పాల్గొన్నారు.

## రజతోత్సవ సభ చరిత్రలో నిలిచిపోతుంది

గంగాధర, ఏప్రిల్ 18: తెలంగాణ తొలి సీఎం కేసీఆర్ ఆధ్వర్యంలో ఈ నెల 27న ఎల్కతుర్తిలో నిర్వహిస్తున్న బీఆర్‌ఎస్ రజతోత్సవ సభ చరిత్రలో నిలిచిపోతుందని పార్టీ మైనార్టీ విభాగం మండలాధ్యక్షుడు ఎండీ అబ్బాస్ శుక్రవారం ప్రకటనలో పేర్కొన్నారు. రజతోత్సవ సభకు మైనార్టీలు అధిక సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని కోరారు. 10 ఏండ్ల పాలనలో ప్రజా సంక్షేమమే లక్ష్యంగా కేసీఆర్ ఆధ్వర్యంలో బీఆర్‌ఎస్ ప్రభుత్వం పని చేసిందని, అన్ని వర్గాల ప్రజలకు న్యాయం చేసేలా అనేక పథకాలు తీసుకువచ్చిందని పేర్కొన్నారు. రజతోత్సవ సభ రాజకీయ కార్యక్రమం కాదని, అదొక విశాల సంకల్పమని, తెలంగాణ రాష్ర్టాన్ని భవిష్యత్తు దిశగా నడిపించే గొప్ప కార్యక్రమమని కొనియాడారు. పల్లె నుంచి పట్నం వరకు ప్రజలు పెద్దఎత్తున తరలిరావాలని కోరారు.

# శిక్షణతోనే సరిపెట్టారు!



నేదునూర్‌లో కేంద్రం వద్ద ఫ్లెక్సీతో మహిళా సంఘాల సభ్యులు (ఫైల్)

- మహిళా సంఘాలకు కొనుగోలు కేంద్రాల బాధ్యతలివ్వని అధికారులు
- తీవ్ర అసంతృప్తిలో సభ్యులు, ప్రతినిధులు

తిమ్మాపూర్, ఏప్రిల్ 18: ఓ వైపు మహిళలను కోటీశ్వరులను చేయాలనేదే తమ సంకల్పం అని ప్రభుత్వ పెద్దలు పదే పదే ప్రకటిస్తుండగా, క్షేత్రస్థాయిలో మాత్రం అందుకు భిన్నమైన పరిస్థితి నెలకొన్నది. ధాన్యం కొనుగోలు కేంద్రాల నిర్వహణ అవకాశాన్ని మహిళలకు ఇచ్చినట్టే ఇచ్చి అధికార యంత్రాంగం వెనక్కి తీసుకోవడం ఇందుకు నిదర్శనంగా నిలుస్తున్నది. కొనుగోలు కేంద్రాల ద్వారా తమకు ఎంతో కొంత ఉపాధి దొరుకుతుందని ఆశలు పెట్టుకున్న మహిళా సంఘాల సభ్యులు, ప్రతినిధుల్లో తీవ్ర అసంతృప్తి వ్యక్తమవుతున్నది.

తిమ్మాపూర్ మండలంలో ప్రతి గ్రామంలో ఏటా పోరండ్ల, నుస్తులాపూర్ సొసైటీలతో పాటు మహిళా సంఘాల ఆధ్వర్యంలో ధాన్యం కొనుగోలు కేంద్రాలను నిర్వహిస్తున్నారు. ఈ క్రమంలో ఈ సంవత్సరం యాసంగికి మండలంలోని 15గ్రామాల్లో సెంటర్లను మహిళా సంఘాల ఆధ్వర్యంలో నిర్వహించేందుకు అధికారులు నిర్ణయించారు. జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో, సివిల్ సప్లై శాఖ ఆధ్వర్యంలో రెండుమూడు రోజులు ఆయా గ్రామాల మహిళా సంఘాల సీఏలు, సభ్యులకు కరీంనగర్‌లో ట్రైనింగ్ సైతం అందజేశారు. రికార్డుల నిర్వహణ, మాయిశ్చర్ చూడడం, తూకం, సెంటర్ నిర్వహణ, రైతులతో సత్సంబంధాలు తదితర అంశాలపై అవగాహన కల్పించారు. 15సెంటర్లకు సరిపడా సభ్యులకు ట్రైనింగ్ ఇచ్చి ఇప్పుడు కేవలం పోలంపల్లి గ్రామానికి మాత్రమే మహిళా సంఘాల ద్వారా అవకాశం కల్పించారు.

### అన్ని సిద్ధం చేసుకున్నాక..

అధికారులు ట్రైనింగ్ ఇచ్చి సెంటర్ల వద్ద ఏర్పాటు చేసేందుకు ఫ్లెక్సీలు సైతం అందజేశారు. గ్రామాల్లో కొనుగోలు కేంద్రాలు నిర్వహించే స్థలాల్లో నిర్వహణ కోసం మహిళా సంఘాల ఆధ్వర్యంలో గుడిసెలు సైతం ఏర్పాటు చేసుకున్నారు. రైతులు వడ్లు ఆరబెట్టేందుకు వీలుగా స్థలాన్ని చదును చేయించారు. పలు సొసైటీల ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న సెంటర్లు తమ చేతిలోకి వచ్చినట్టే అనుకున్న తరుణంలో అధికారులు బాంబు పేల్చారు. ఈ పసలుకు మహిళా సంఘాలకు అనుమతులు లేవని, నెక్స్ట్ టైం వస్తుందేమో చూద్దాం అంటూ సెర్ప్ అధికారులు తెలుపడంతో మహిళా సంఘాల సభ్యులు నిరాశకు లోనవుతున్నారు.

### ఇదేనా కోటీశ్వరులను చేయడం..

మహిళలను కోటీశ్వరులను చేస్తామని అని చెప్పుకొనే ప్రభుత్వ పెద్దలు.. క్షేత్రస్థాయిలో తమకు ఉపాధి కల్పిస్తామని ఇప్పుడు సెంటర్లు అలాట్ చేయకపోవడమేమిటని సీఏలు, సంఘాల సభ్యులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇదేనా కోటీశ్వరులను చేసే విధానం అంటూ ప్రశ్నిస్తున్నారు. విషయం బయటకు వస్తే అధికారులు తమను ఎక్కడ ఇబ్బంది పెడుతారోనని లోలోపలే అసంతృప్తి చెందుతున్నారు. సీఏలు సైతం చిన్న ఉద్యోగులం.. మళ్లీ మాకే ఇబ్బంది అవుతుందంటూ విషయం చెప్పలేకపోతున్నారు. మహిళా సంఘాల చేతికి వచ్చిన కేంద్రాలు.. తిరిగి సొసైటీలకే పోయిన సంగతి ఏమిటో అధికారులకే తెలియాలని మహిళా సంఘాల సభ్యులు గుసగుసపెట్టుకుంటున్నారు. ఇందు లో ఎవరి హస్తం ఉన్నదోనని గుర్రుగా ఉన్నారు.

# పాఠశాలల మూసివేతకు కుట్ర

- డీటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు సోమయ్య



మాట్లాడుతున్న డీటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు సోమయ్య

కమాన్‌చౌరస్తా, ఏప్రిల్ 18: కాంగ్రెస్ ప్రభుత్వం సంస్కరణల పేరిట పాఠశాలల కుదింపు, మూసివేతకు కుట్రలు చేస్తున్నదని డీటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు సోమయ్య ఆరోపించారు. డీటీఎఫ్ కరీంనగర్ జిల్లా 15వ, వార్షిక కౌన్సిల్ సమావేశం శుక్రవారం జిల్లా కేంద్రంలో నిర్వహించారు. డీటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు ఆవాల నరహరి అధ్యక్షతన జరిగిన సమావేశంలో జిల్లా ప్రధాన కార్యదర్శి తూముల తిరుపతి సంఘ సంస్థాగత, విద్యారంగ, ఉపాధ్యాయ, సామాజిక సమస్యలు, కార్యకలాపాల వార్షిక నివేదిక సమర్పించారు. ఈ సమావేశానికి ముఖ్యఅతిథిగా హాజరైన డీటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు ఎం సోమయ్య మాట్లాడుతూ, విద్యార్థుల సంఖ్య తక్కువగా ఉంటున్నదనే నెపంతో, పాఠశాలల సంఖ్యను తగ్గించి మండలానికి ఐదు లేదా ఆరు ప్రాథమిక పాఠశాలలు, మూడు లేదా నాలుగు ఉన్నత పాఠశాలలు మాత్రమే ఉనికిలో ఉండేలా విద్యా కమిషన్ ద్వారా ప్రయత్నాలు చేస్తున్నదన్నారు. దీనిని డీటీఎఫ్ తీవ్రంగా ఖండిస్తున్నదని, ఇంటిగ్రేటెడ్ స్కూల్స్, ఇంటర్నేషనల్ స్కూల్స్ పేరిట ప్రధాన స్రవంతి పాఠశాలలకు ముప్పు వాటిల్లనున్నదని ఆందోళన వ్యక్తం చేశారు. డీటీఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి టి. లింగారెడ్డి ప్రసంగిస్తూ, కాంగ్రెస్ ప్రభుత్వం ఉద్యోగ ఉపాధ్యాయుల ఆర్థిక సమస్యలు పాలనాపరమైన సమస్యలు పరిష్కరించడంలో విఫలమైందని, ఇచ్చిన వాగ్దానాలను నిలబెట్టుకోవడం లేదని విమర్శించారు. కార్యక్రమంలో డీటీఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు వి. రాజిరెడ్డి, రాష్ట్ర కార్యదర్శి అటుకుల శ్రీనివాస్ రెడ్డి, రాష్ట్ర ఆడిట్ కమిటీ కన్వీనర్ పి. ఈశ్వర్ రెడ్డి, రాష్ట్ర పూర్వ అధ్యక్షుడు కే నారాయణరెడ్డి, ఎం రఘుశంకర్ రెడ్డి, పెద్దపల్లి జిల్లా ప్రధాన కార్యదర్శి ఏ సంతోష్ రెడ్డి, సిరిసిల్ల జిల్లా అధ్యక్షుడు డి.శ్రీహరి, కరీంనగర్ జిల్లా ఉపాధ్యక్షుడు సభ్యులు కే రాజమౌళి, ఏ దామోదర్, సముద్రాల అంజయ్య, చకినాల రామ్మోహన్, ఏ శ్రీనివాస్, రాష్ట్ర కౌన్సిలర్లు జయప్రద, గౌతమి, వి. రత్నం, కోహెడ చంద్రమౌళి, కే కిషన్ రెడ్డి, టి. తిరుపతి గౌడ్, ఎం. సదానందం, చకినాల దేవేందర్, బి. రమేశ్, వి. రామ్ కిరణ్, పి. సంపత్ రెడ్డి, మండలాల ప్రధానబాధ్యులు, జిల్లా కౌన్సిలర్లు పాల్గొన్నారు.

# కొనుగోలు కేంద్రాల్లోనే ధాన్యం విక్రయించాలి

- ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ



మానకొండూర్: ఏఎంసీలో కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే కవ్వంపల్లి

మానకొండూర్/రూరల్/ శంకరపట్నం/ తిమ్మాపూర్, ఏప్రిల్ 18: ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాల్లోనే రైతులు ధాన్యం విక్రయించి మద్దతు ధర పొందాలని ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ సూచించారు. శుక్రవారం మానకొండూర్ సింగిల్‌విండో ఆధ్వర్యంలో స్థానిక వ్యవసాయ మార్కెట్ కమిటీ ఆవరణలో ఏర్పాటు చేసిన వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని సింగిల్‌విండో చైర్మన్ నల్ల గోవింద రెడ్డితో కలిసి ప్రారంభించారు. అలాగే తిమ్మాపూర్ మండలం రేణికుంట, కొత్తపల్లి, నుస్తులాపూర్, నల్లగొండ, మక్తపల్లి, బాలయ్యపల్లి, పర్లపల్లి, మొగిలిపాలెం, నర్సింగాపూర్, పోలంపల్లి, మల్లాపూర్, మన్నెంపల్లి, పోరండ్ల గ్రామాల్లో ఐకేపీ, సింగిల్ విండోల ఆధ్వర్యంలో, మానకొండూర్ మండలం ముంజంపల్లి, రంగపేట, పచ్చునూర్, వెల్ది, వేగురుపల్లి గ్రామాల్లో మానకొండూర్ సొసైటీ, ఐకేపీల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాలను ఎమ్మెల్యే అదనపు కలెక్టర్ లక్ష్మీకిరణ్‌తో కలిసి ప్రారంభించారు. అలాగే శంకరపట్నం మండలం తాడికల్, కేశవపట్నం, కొత్తగట్టు, లింగాపూర్, మెట్‌పల్లి, ఆముదాలపల్లి, మొలంగూర్, కరీంపేట్ గ్రామాల్లో ధాన్యం కొనుగోలు కేంద్రాలు ప్రారంభించారు. ఆయా చోట్ల ఎమ్మెల్యే మాట్లాడుతూ, రైతులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా కొనుగోలు కేంద్రాల్లో అన్ని వసతులు కల్పించామన్నారు. ధాన్యం కొనుగోళ్ల సందర్భంగా రైతులకు నష్టం కలిగించేలా వ్యవహరిస్తే సహించబోమని కేంద్రాల నిర్వాహకులు, మిల్లర్లకు స్పష్టం చేశారు. ఆయా కార్యక్రమాల్లో మానకొండూర్ ఏఎంసీ చైర్మన్ మర్రి ఓదెలు, వైస్ చైర్మన్ రామిడి తిరుమల్‌రెడ్డి, తహసీల్దార్లు రాజేశ్వరి, భాస్కర్, డీసీవో నర్సింగరావు, తాడికల్ సింగిల్ విండో చైర్మన్ కేతిరి మధూకర్‌రెడ్డి, శంకరపట్నం మాజీ జడ్పీటీసీ బత్తిని శ్రీనివాస్ గౌడ్, ఏఎంసీ వైస్ చైర్మన్ తిరుపతి, డైరెక్టర్లతోపాటు, కాంగ్రెస్ పార్టీ మండలాధ్యక్షులు నందగిరి రవి, బసవయ్య, ఆయా సొసైటీల అధ్యక్షులు, పాలకవర్గ సభ్యులు, ఆయా గ్రామాల నాయకులు, రైతులు పాల్గొన్నారు.

## దళారులను నమ్మి మోసపోవద్దు: ఎమ్మెల్యే సత్యం



రుక్మాపూర్ గ్రామంలో ధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే సత్యం

చొప్పదండి, ఏప్రిల్ 18: రైతులు తమ ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాల్లోనే మద్దతు ధరకు అమ్ముకోవాలని, దళారులను నమ్మి మోసపోవద్దని ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం సూచించారు. మండలంలోని రుక్మాపూర్, కొలిమికుంట, రాగంపేట, ఆర్నకొండ, చొప్పదండి, భూపాలపట్నం, వెదురుగట్ట గ్రామాల్లో ఐకేపీ, ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వరి కొనుగోలు కేంద్రాలను శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, కేంద్రాల నిర్వాహకులు రైతులకు అన్ని సౌకర్యాలు కల్పించాలన్నారు. అనంతరం వెదురుగట్టలో కాంగ్రెస్ శ్రేణులతో కలిసి నిర్వహించిన జై బాపు జై భీమ్ జై సంవిధాన్ రాజ్యాంగ పరిరక్షణ పాదయాత్రలో ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం పాల్గొన్నారు. కార్యక్రమాల్లో అధికారులు, కాంగ్రెస్ మండల నాయకులు, ప్రజా ప్రతినిధులు, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

## నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

హౌసింగ్‌బోర్డుకాలనీ, ఏప్రిల్ 18: నగరంలోని 8వ డివిజన్ అల్గునూర్ 11 కేవీ టౌన్ ఫీడర్ పరిధిలో విద్యుత్ తీగల కింద చెట్ల కొమ్మలు తొలగిస్తున్నందున శనివారం ఉదయం 8 నుంచి 10 గంటల వరకు సరఫరా నిలిపివేయనున్నట్లు విద్యుత్ శాఖ అధికారులు ఒక ప్రకటనలో తెలిపారు. చేపల కాలనీ, కేంద్రీయ విద్యాలయం, అక్షర స్కూల్, వార్త ఆఫీస్ ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని పేర్కొన్నారు. వినియోగదారులు గమనించి, సహకరించాలని కోరారు.

# ఘరానా దొంగ 'అల్లెపు' అరెస్టు

- మూడున్నర తులాల బంగారం స్వాధీనం
- రాష్ట్రవ్యాప్తంగా నిందితుడిపై 85 కేసులు
- వివరాలు వెల్లడించిన హుజూరాబాద్ ఏసీపీ సీహెచ్ శ్రీనివాస్‌జీ

జమ్మికుంట, ఏప్రిల్ 18 : రాష్ట్రవ్యాప్తంగా పలు చోరీ కేసుల్లో నిందితుడైన ఘరానా దొంగ అల్లెపు కృష్ణను జమ్మికుంట పోలీసులు అరెస్టు చేశారు. అతడి వద్ద మూడున్నర తులాల బంగారాన్ని స్వాధీనం చేసుకుని, రిమాండ్‌కు తరలించారు. శుక్రవారం జమ్మికుంట పట్టణ పోలీస్ స్టేషన్‌లో హుజూరాబాద్ ఏసీపీ సీహెచ్ శ్రీనివాస్ జీ విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడించారు. వీణవంక మండలం కనపర్తి గ్రామానికి చెందిన అల్లెపురెడ్డి కమలమ్మ-కొమురారెడ్డి వృద్ధ దంపతులు కాగా, కొమురారెడ్డి అనారోగ్యంతో బాధపడుతూ జమ్మికుంట పట్టణంలోని వరుణ్‌సాయి దవాఖానకు ఈ నెల 15న వచ్చారు. వైద్యుడు అందుబాటులో లేకపోవడంతో కొండూరు కాంప్లెక్స్‌లో ఇంటికి సంబంధించిన వస్తువులు కొనే క్రమంలో వృద్ధులకు సిద్ధిపేట జిల్లా కేంద్రంలోని వడ్డెరకాలనీకి చెందిన అల్లెపు కృష్ణ కలిశాడు. తాను కనపర్తి గ్రామ కార్యదర్శినంటూ పరిచయం చేసుకున్నాడు. ఇద్దరికీ పింఛన్ ఇప్పిస్తానని నమ్మబలికి ఆధార్, ఫొటో కావాలని కోరాడు. జిరాక్స్‌ల కోసం కొమురారెడ్డి షాపునకు వెళ్లి పోగా, ఫొటో తీస్తానని కమలమ్మ మెడలోని రెండు తులాల బంగారు గొలుసు తీయమని చెప్పడంతో ఆమె తీసి కృష్ణకు ఇచ్చింది. వెంటనే ఆ గొలుసుతో కృష్ణ ఉడాయించాడు. దీంతో మోసపోయానని తెలుసుకున్న కమలమ్మ స్థానిక పోలీసులకు ఫిర్యాదు చేయగా, సీఐ రవి కేసు నమోదు చేశారు. రంగంలో దిగిన పోలీసులు సీసీ పుటేజీలు, సాంకేతిక పరిజ్ఞానంతో ముందుకు సాగారు. కాగా, రెండు తులాల బంగారు గొలుసుతో పాటు హైదరాబాద్‌లో చోరీ చేసిన మరో తులంన్నర బంగారాన్ని విక్రయించేందుకు కృష్ణ శుక్రవారం జమ్మికుంట వచ్చాడు. స్థానిక తెలంగాణ చౌక్ వద్ద కృష్ణను అదుపులోకి తీసుకుని విచారించారు. అతడి వద్ద మూడున్నర తులాల బంగారు గొలుసును స్వాధీనం చేసుకుని, రిమాండ్‌కు తరలించారు. కృష్ణపై రాష్ట్రవ్యాప్తంగా 85 కేసులున్నాయని, గతంలో ఇతడిపై రెండుసార్లు పీడీ యాక్టు నమోదు కాగా, నాలుగేళ్లు జైలు శిక్ష అనుభవించాడని ఏసీపీ పేర్కొన్నారు. కాగా, 48 గంటల్లో కేసును ఛేదించిన సీఐ రవి, హెచ్‌సీలు మోహన్, సదయ్య, పీసీ అబ్దుల్ ఖదీర్, శ్రీకాంత్‌ను ఏసీపీ అభినందించారు.

## వ్యాపారులందరూ ట్రేడ్ లైసెన్స్ తీసుకోవాలి

కార్పొరేషన్, ఏప్రిల్ 18: కరీంనగర్ నగరపాలక సంస్థ పరిధిలోని వ్యాపారులందరూ తప్పనిసరిగా ట్రేడ్ లైసెన్స్ తీసుకోవాలని నగర డిప్యూటీ కమిషనర్ స్వరూపారాణి తెలిపారు. శుక్రవారం నగరంలోని చేపడుతున్న ట్రేడ్ లైసెన్సుల పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, ట్రేడ్ లైసెన్సుకు సంబంధించి సరైన కొలతలు వేసి ఫీజులు నిర్ణయించాలని సిబ్బందిని ఆదేశించారు. లైసెన్సుల ఫీజుల విషయంలో ఏవైనా అవకతవకలు జరిగితే కఠిన చర్యలు చేపడుతామన్నారు. వ్యాపారులు లైసెన్స్ సెల్ఫ్ అసెస్మెంట్ ద్వారా కూడా పొందవచ్చని తెలిపారు. అలాగే, ప్రభుత్వం అందిస్తున్న రిబేట్‌ను వినియోగించుకొని ఈ నెలాఖరులోగా ఆస్తి పన్నులు చెల్లించాలని కోరారు. కార్యక్రమంలో ఆర్‌వో భూమానందం, ఆర్‌ఐ శ్యాంసుందర్, సిబ్బంది పాల్గొన్నారు.

## ఒప్పందం ప్రకారం కూలిరేట్లు తీసుకోవాలి

వీణవంక, ఏప్రిల్ 18: హమాలీలు ఒప్పందం ప్రకారం కూలిరేట్లు తీసుకోవాలని సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి కొప్పుల శంకర్ తెలిపారు. శుక్రవారం మండల కేంద్రంలోని హమాలీ సంఘం ఆవరణలో నిర్వహించిన కార్మికుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ, బజార్, సిమెంట్, ఫర్టిలైజర్, ఐకేపీ. మేల్, ఫిమేల్ వరిధాన్యం మక్కలు, ఐరన్ ఎగుమతులు, దిగుమతులకు సంబంధించిన కూలిరేట్లను ప్రస్తుతం ఇస్తున్న దానిపై అదనంగా 20 శాతం పెంచి ఇచ్చేందుకు రైతులు, ఆయా వర్తక, వ్యాపార యాజమాన్యాలు నిర్ణయించినట్లు తెలిపారు. ఈ ఒప్పందం ప్రకారం కూలిరేట్లు తీసుకోవాలని, అధికంగా తీసుకున్నట్లయితే యూనియన్ తీసుకునే చర్యకు కట్టుబడి ఉండాలని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో హమాలీ యూనియన్ జిల్లా అధ్యక్షుడు పిల్లి రవియాదవ్, మండల కార్యదర్శి, వర్తక పెద్దలు, తదితరులు పాల్గొన్నారు.

## హైదరాబాద్‌లో రోడ్డు ప్రమాదం.. బోర్నపల్లిలో విషాదం

హుజూరాబాద్ టౌన్, ఏప్రిల్ 18: హైదరాబాద్‌లోని మణికొండ వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో హుజూరాబాద్ మున్సిపాలిటీ పరిధిలోని బోర్నపల్లికి చెందిన కుతాడి జీవన్ (23) మృతి చెందాడు. జీవన్ హైదరాబాద్‌లో స్విగ్గీ డెలివరీ బాయ్‌గా ఉద్యోగం చేస్తున్నాడు. శుక్రవారం మణికొండ వద్ద కారు ఢీకొన్న అనంతరం లారీ కింద పడడంతో అతడు మృతి చెందాడని కుటుంబ సభ్యులు తెలిపారు. జీవన్ మృతితో బోర్నపల్లిలో విషాదఛాయలు నెలకొన్నాయి.

## పోలీసులు విచారణ చేయడం లేదని కలెక్టర్‌కు మాజీ మేయర్ ఫిర్యాదు

కరీంనగర్ కార్పొరేషన్, ఏప్రిల్ 18 : నగర పరిధిలో లేని బొమ్మకల్ చౌరస్తాలో అభివృద్ధి పనులకు స్మార్ట్‌సిటీ నిధుల వినియోగంపై తాను నగర కమిషనర్‌పై పోలీసులకు ఫిర్యాదు చేశానని, కానీ ఈ విచారణకు సంబంధించి నగరపాలక సంస్థ నుంచి పోలీసులకు సమాచారం ఇవ్వడం లేదని, దీనిపై తగు చర్యలు తీసుకోవాలని కలెక్టర్‌కు మాజీ మేయర్ సర్దార్ రవీందర్‌సింగ్ శుక్రవారం ఫిర్యాదు చేశారు. స్మార్ట్‌సిటీ ప్రాజెక్టు నిబంధనలకు విరుద్ధంగా నగరపాలక సంస్థ అధికారులు అభివృద్ధి పనులు చేపడుతున్నారని, దీనిపై విచారణ చేపట్టాలని వన్‌టౌన్ పోలీస్ స్టేషన్‌లో గతేడాది సెప్టెంబర్ 11న ఫిర్యాదు చేయగా, వారు ఎఫ్‌ఐఆర్ నమోదు చేసినట్లు గుర్తు చేశారు. కాగా, ఈ కేసు విషయంలో విచారణకు సంబంధించి నగరపాలక సంస్థ అధికారులు సమాచారం ఇవ్వడం లేదని పోలీసులు చెబుతున్నట్లు తెలిపారు. కేసు నమోదై ఆరు నెలలు దాటినా ఎలాంటి విచారణ సాగడం లేదని చెప్పారు.

## రాష్ట్రస్థాయి అబాకస్ పోటీలకు విద్యార్థుల ఎంపిక

గంగాధర, ఏప్రిల్ 18 : మండల కేంద్రంలోని వివేకానంద పాఠశాల విద్యార్థులు అష్మిత, శ్రీవేద, లాస్య, మనస్విని, నిహారిక, ధరణేశ్వర్ రాష్ట్రస్థాయి అబాకస్ పోటీలకు ఎంపికైనట్లు పాఠశాల కరస్పాండెంట్ పర్రెం లక్ష్మారెడ్డి శుక్రవారం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, గణితం అంటే విద్యార్థుల్లో ఉన్న భయాన్ని పోగొట్టి, చదువంటే ఆసక్తిని పెంచేలా అబాకస్ ద్వారా చేతి వేళ్లతో లెక్కలను క్యాలిక్యులేటర్ కంటే వేగంగా చేయడం వంటి వాటిని పాఠశాలలో నేర్పిస్తున్నట్లు తెలిపారు. వీటిలో అత్యుత్తమ ప్రతిభ చూపి విద్యార్థులు రాష్ట్రస్థాయికి ఎంపికైనట్లు చెప్పారు. విద్యార్థులను కరస్పాండెంట్ లక్ష్మారెడ్డి, డైరెక్టర్ గుడి అనంత రెడ్డి, ప్రధానోపాధ్యాయులు నర్సింగరావు, ఉషారాణి, ఉపాధ్యాయులు అభినందించారు.

## యాక్సిడెంట్ జోన్లలో అప్రమత్తంగా ఉండాలి

హుజూరాబాద్ టౌన్, ఏప్రిల్ 18: హుజూరాబాద్ సబ్ డివిజన్ పరిధిలో కొన్ని ప్రాంతాలను యాక్సిడెంట్ జోన్లుగా గుర్తించామని, అలాంటి ప్రదేశాల్లో వాహనదారులు అప్రమత్తంగా ఉండాలని ఏసీపీ శ్రీనివాస్ జీ సూచించారు. శుక్రవారం సబ్ డివిజన్ పరిధిలో గుర్తించిన యాక్సిడెంట్ జోన్లలో సూచికలతో పాటు ప్రమాద ప్రాంతాలను వాహనదారులు గుర్తించేందుకు వీలుగా రహదారులపై రేడియం స్టిక్కర్లు ఏర్పాటు చేయించారు. అలాగే తుమ్మనపల్లి, కేశవపట్నం గ్రామాల్లో పలు రహదారి భద్రతా చర్యలను చేపట్టామని ఏసీపీ తెలిపారు. రహదారి భద్రతా బృందం నిరంతరంగా ఆయా ప్రాంతాలను పర్యవేక్షిస్తూ, తీసుకున్న చర్యల ప్రభావాన్ని గమనిస్తూ ఉంటుందని తెలిపారు. సూచికల ఏర్పాటులో హుజూరాబాద్ సీఐ తిరుమల్ గౌడ్, రూరల్ సీఐ వెంకట్ గౌడ్ తోపాటు పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

## చికిత్స పొందుతూ ఒకరి మృతి

జమ్మికుంట, ఏప్రిల్18: శాయంపేట గ్రామానికి చెందిన మడికొండ శ్రీనివాస్‌రావు అనే వ్యక్తి గడ్డి మందు తాగి ఆత్మహత్యకు యత్నించగా, చికిత్స పొందుతూ గురువారం రాత్రి మృతి చెందినట్లు పట్టణ సీఐ వీ రవి తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. శ్రీనివాస్‌రావుకు వ్యవసాయం ఉంది. సొంతంగా ట్రాక్టర్ కూడా ఉంది. అయితే గత ఎనిమిది సంవత్సరాల క్రితం శ్రీనివాస్‌రావు ట్రాక్టర్ నడుపున్న సమయంలో ప్రమాదం జరిగింది. ట్రాక్టర్ కింద పడి ఒకరు మృతి చెందారు. బాధితులకు ఇచ్చే ఖర్చుల కింద ట్రాక్టర్‌తో పాటు తనకున్న భూమిని అమ్ముకున్నాడు. అప్పటి నుంచి మానసికంగా కుంగిపోయాడు. మద్యానికి బానిసయ్యాడు. ఇటీవల అనారోగ్యానికి గురయ్యాడు. అతిగా మద్యం సేవించడం వల్ల శరీరంలోని అవయవాలు క్షీణించిపోయాయని వైద్యులు చెప్పడంతో మనస్తాపానికి గురయ్యాడు. ఈ నెల 15న మధ్యాహ్నం ఇంట్లో ఎవరూ లేని సమయంలో గడ్డి మందు తాగాడు. స్థానిక ఓ ప్రైవేట్ దవాఖానలో ప్రథమ చికిత్స అందించారు. మెరుగైన వైద్యం కోసం వరంగల్ ఎంజీఎం దవాఖానకు తరలించగా, చికిత్స పొందుతూ మృతి చెందాడు. మృతుడి భార్య లత ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు సీఐ చెప్పారు.

## యశోద ఉచిత వైద్య శిబిరం విజయవంతం



పరీక్షలు చేస్తున్న వైద్యురాలు

విద్యానగర్, ఏప్రిల్ 18: సోమాజిగూడ యశోద హాస్పిటల్స్, కరీంనగర్ యశోద మెడికల్ సెంటర్ ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించిన ఉచిత వైద్య శిబిరం విజయవంతమైంది. ఈ వైద్య శిబిరంలో 150 మంది పేషెంట్స్ పాల్గొని న్యూరో సర్జరీ, గ్యాస్ట్రోఎంట్రాలజీ వైద్యాన్ని ఉచితంగా పొందారు. ఈ వైద్య శిబిరంలో డాక్టర్ జయంత్ మూడే (సర్జికల్ గ్యాస్ట్రోఎంటరాలజిస్ట్), డాక్టర్ అనంత్ (న్యూరో సర్జన్) సోమాజిగూడ యశోద హాస్పిటల్ నుంచి పాల్గొని రోగులందరిని పరీక్షించి, వైద్యాన్ని ఉచితంగా అందించడమే కాకుండా తదుపరి శస్త్ర చికిత్సల కోసం సలహాలు, సూచనలు చేశారు. ఈ వైద్య శిబిరంలో యశోద హాస్పిటల్ సోమాజిగూడ వైద్యులు, యశోద కరీంనగర్ సిబ్బంది, నర్సింగ్ సిబ్బంది పాల్గొన్నారు.

## సీసీ రోడ్డు పనులను ప్రారంభించిన సుడా చైర్మన్

కొత్తపల్లి, ఏప్రిల్ 18: చింతకుంట వినాయకనగర్ ఇందిరమ్మకాలనీ సీసీ రోడ్డు నిర్మాణ పనులకు సుడా చైర్మన్ కె. నరేందర్‌రెడ్డి శుక్రవారం ప్రారంభించారు. రూ.15 లక్షల సుడా నిధులతో ఈ రోడ్డు నిర్మిస్తున్నారు. కార్యక్రమంలో కాలనీవాసులు ఎం. మోహన్, శ్రవణ్, పి. రవీందర్ పాల్గొన్నారు.

## ఇన్‌చార్జి ఎస్‌ఈగా శ్రీనివాస్‌రావు

కార్పొరేషన్, ఏప్రిల్ 18: కరీంనగర్ నగరపాలక సంస్థ ఇన్‌చార్జి సూపరింటెండెంట్ ఇంజినీర్ బాధ్యతలు శ్రీనివాస్‌రావుకు అప్పగించారు. నగరపాలక సంస్థ ఎస్‌ఈ రాజ్‌కుమార్ ఇటీవల నెల రోజులకు పైగా సెలవుల్లో వెళ్లడంతో వరంగల్ పబ్లిక్ హెల్త్ ఎస్‌ఈగా పని చేస్తున్న శ్రీనివాస్‌రావుకు బాధ్యతలు అప్పగిస్తూ ఉత్తర్వులు జారీ అయ్యాయి.

## ఇంజినీరింగ్ విభాగంలో అంతర్గత బదిలీలు

కార్పొరేషన్, ఏప్రిల్ 18 : కరీంనగర్ నగరపాలక సంస్థ ఇంజినీరింగ్ విభాగంలో అంతర్గత బదిలీలు చేపడుతూ కమిషనర్ ఉత్తర్వులు జారీ చేశారు. గత మూడు నెలల క్రితమే బదిలీలు జరుగగా, కొత్తగా ఇద్దరు ఏఈలు నగరపాలక సంస్థకు రావడంతో మరోసారి బదిలీలు చేపట్టారు. ఈఈ యాదగిరికి హైలెవల్ నీటి సరఫరాతోపాటు, వీధి దీపాల నిర్వహణ, ఫిల్టర్‌బెడ్ పనులు, ఈఈ సంజయ్‌కుమార్‌కు లోలెవల్ నీటి సరఫరా, నర్సరీలు, వనమహోత్సవం, ఎస్‌టీపీ పనులను అప్పగించారు. అలాగే, డీఈ వెంకటేశ్వర్లుకు కోతిరాంపూర్, మార్కెట్, హౌసింగ్‌బోర్డు రిజర్వాయర్లు, 8, 9, 10, 32, 6, 45, 46, 48, 49, 0, 51, 52, 7, 30, 31, 47వ డివిజన్ల సివిల్ పనులకు అసిస్టెంట్ ఇంజినీర్‌గా సతీశ్‌ను కేటాయించారు. డీఈ లచ్చిరెడ్డికి ఎస్‌ఆర్‌ఆర్, కోర్టు రిజర్వాయర్ నీటి సరఫరాతో పాటు, 20, 21, 22, 40, 57, కొత్తపల్లి, 23, 41, 42, 43, 53, 58, 59, 60వ డివిజన్లకు అసిస్టెంట్ ఇంజినీర్‌గా భీమ్‌వర్ధన్‌రెడ్డిని, డీఈ శ్రీనివాస్‌కు మల్కాపూర్, రాంనగర్ నీటి సరఫరాతోపాటు 17, 18, 19, 38, 39, 56, చింతకుంట, మల్కపూర్ పనులకు అసిస్టెంట్ ఇంజినీర్‌గా సల్మాన్‌ఖాన్‌ను, డీఈ ఓం ప్రకాశ్‌కు గౌతమినగర్, భగత్‌నగర్ రిజర్వాయర్లతో పాటు 33, 34, 35, 11, 12, 13వ డివిజన్ పనులకు అసిస్టెంట్ ఇంజినీర్‌గా గట్టుస్వామిని కేటాయించారు. వీటితోపాటు వీధిదీపాల నిర్వహణ ఏఈగా గఫూర్‌కు బాధ్యతలు అప్పగించారు.

## యువత వ్యసనాలకు బానిస కావద్దు

గంగాధర, ఏప్రిల్ 18: యువత వ్యసనాలకు బానిస కాకుండా భవిష్యత్తులో ఉత్తమ పౌరులుగా ఎదగాలని ఎస్‌ఐ వంశీకృష్ణ అన్నారు. గంగాధర మండల కేంద్రానికి చెందిన న్యాలకొండ ప్రవీణ్‌రావు ఆధ్వర్యంలో 16 మంది క్రికెట్ క్రీడాకారులకు ట్రాక్‌షూ పంపిణీ కార్యక్రమాన్ని ఆదివారం మండల కేంద్రంలో నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఎస్‌ఐ వంశీకృష్ణ క్రీడాకారులకు ట్రాక్‌షూను అందజేశారు. కార్యక్రమంలో నాయకులు రవీంద్రనాథ్‌ఠాగూర్, ఉప్పుల గంగాధర్, క్రీడాకారులు విజయ్, శ్రీనివాస్, లవకుమార్, శశికిరణ్, ఉపేందర్, వివేక్, ప్రణయ్, నరేశ్, రామకృష్ణ, మధుకర్, ప్రదీప్, సాయచరణ్, అభిరానందన్, ఉద్భవ్ ఠాగూర్, ప్రమోద్ తదితరులు పాల్గొన్నారు.

## సీడ్ కంపెనీలు ప్రభుత్వ మద్దతు ధర చెల్లించాలి

శంకరపట్నం, ఏప్రిల్ 18: రైతులకు ప్రభుత్వం ఇస్తున్న మాదిరిగా సీడ్ కంపెనీలు కూడా మద్దతు ధర చెల్లించాలని మెట్‌పల్లి సింగిల్ విండో తాజా మాజీ చైర్మన్, మాజీ జడ్పీటీసీ పొద్దుటూరి సంజీవరెడ్డి డిమాండ్ చేశారు. శుక్రవారం ఆయన మండల కేంద్రంలో విలేకరులతో మాట్లాడారు. పలు సీడ్ కంపెనీలు రైతులతో సన్న రకమైన ఓపీ సీడ్‌ను వేయించాయని తెలిపారు. కాగా, ప్రభుత్వం రైతులకు మద్దతు ధర రూ.2300, బోనస్ రూ.500 కలిపి రూ.2800 ఇస్తున్నట్లు సీడ్ కంపెనీలు కూడా రూ.2800 చెల్లించాలని డిమాండ్ చేశారు. అలాగే దొడ్డు రకానికి రూ.2400 చెల్లించాలన్నారు. లేదా రైతులను సమీకరించి సీడ్ కంపెనీలపై పోరాటాలు చేయకతప్పదని హెచ్చరించారు.

## ప్రభుత్వ భూమిని పేదలకు పంచేలా పార్టీ శ్రేణులు కృషి చేయాలి

తెలంగాణచౌక్, ఏప్రిల్ 18: నగరంలోని ప్రభుత్వ భూములను రాజకీయ నాయకులు, కార్పొరేటర్లు అక్రమంగా కబ్జా చేశారని, వాటిని పేదలకు పంచేలా సీపీఐ పార్టీ శ్రేణులు కృషి చేయాలని ఆ పార్టీ జాతీయ కార్యవర్గ సభ్యుడు చాడ వెంకటరెడ్డి పిలుపునిచ్చారు. శుక్రవారం నగరంలోని పార్టీ కార్యాలయం బద్దం ఎల్లారెడ్డి భవనంలో నగర కార్యదర్శి కసిరెడ్డి సరేందర్‌రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన నగర శాఖ 11 మహాసభలకు జిల్లా కార్యదర్శి మర్రి వెంకటస్వామితో కలిసి హాజరయ్యారు. ఈ సందర్భంగా చాడ వెంకటరెడ్డి మాట్లాడుతూ, డివిజన్‌లో పర్యటించి ప్రజల సమస్యలను తెలుసుకోవాలని సూచించారు. కేంద్ర ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలను ఎండగట్టాలన్నారు. సమావేశంలో నాయకులు పైడిపల్లి రాజు, బుచ్చన్న యాదవ్, సదానందం, సత్యనారాయణ, బాలయ్య, లక్ష్మి, అంజలి పాల్గొన్నారు.

## ఆదివాసీలపై దాడులు ఆపాలి

తెలంగాణచౌక్, ఏప్రిల్ 18: దండకారణ్యంలో ఆదివాసీలపై కేంద్ర ప్రభుత్వం ఆపరేషన్ కగార్ పేరుతో జరుపుతున్న దాడులను ఆపాలని ఆదివాసీ హక్కుల పోరాట సంఘీభావ వేదిక కన్వీనర్ మల్లన్న, సీపీఐ జిల్లా కార్యదర్శి మర్రి వెంకటస్వామి డిమాండ్ చేశారు. నగరంలోని సీపీఐ కార్యాలయంలో శుక్రవారం వారు మాట్లాడుతూ, అడవుల్లోని కోట్ల రూపాయల విలువైన అటవీ సంపదను కార్పొరేట్ సంస్థలకు అప్పగించడం కోసం కేంద్ర ప్రభుత్వం ఆపరేషన్ కగార్ పేరుతో కేంద్ర బలగాలతో దాడులను చేయిస్తున్నదని ఆరోపించారు. అడవుల నుంచి ఆదివాసులను వెళ్లగొట్టాలని కుట్రలు చేస్తున్నదని మండిపడ్డారు. కేంద్ర ప్రభుత్వ చర్యలకు నిరసనగా ఈ నెల 20న బద్దం ఎల్లారెడ్డి భవనంలో నిర్వహిస్తున్న సభలో మేధావులు, విద్యావంతులు, ప్రజాస్వామికవాదులు, విద్యార్థులు, కార్మిక, కర్షక నాయకులు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. సమావేశంలో నాయకులు రత్నకుమార్, రవి పాల్గొన్నారు.

## బార్ అసోసియేషన్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులకు సన్మానం

హుజూరాబాద్ టౌన్, ఏప్రిల్ 18: హుజూరాబాద్ బార్ అసోసియేషన్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులుగా ఇటీవల ఎన్నికైన యతిపతి అరుణ్ కుమార్, ఎర్రోళ్ల రమేశ్‌ను తెలంగాణ బీసీ సిటిజన్ ఫెడరేషన్ సభ్యులు శాలువాలతో శుక్రవారం సన్మానించారు. ఈ సందర్భంగా తెలంగాణ బీసీ సిటిజన్ ఫెడరేషన్ రాష్ట్ర నాయకులు చందుపట్ల జనార్ధన్, సందెల వెంకన్న మాట్లాడుతూ.. బార్ అసోసియేషన్ బాధ్యులుగా బడుగు బలహీనవర్గాల బిడ్డలు ఎన్నికవడం హర్షణీయమన్నారు. కార్యక్రమంలో బీసీ నాయకులు ఆలేటి రవీందర్, ఉప్పు శ్రీనివాస్, ఆకుల సదానందం, సొల్లు బాబు, తులసి లక్ష్మణమూర్తి, చల్లూరి రఘు చారి, వేముల కరుణాకర్, ఏనూరి అశోక్, గోస్కుల మధు, పసుల స్వామి, ములుగు రమేశ్, పోగు సమ్మయ్య తదితరులు పాల్గొన్నారు.

## వక్ఫ్ సవరణ బిల్లుకు మద్దతునివ్వడం హాస్యాస్పదం

కలెక్టరేట్, ఏప్రిల్ 18 : ఖాదియాని అహ్మదియ్య వర్గానికి చెందిన వారు ముస్లిం వేషధారణతో వచ్చి వక్ఫ్ సవరణ బిల్లుకు మద్దతు తెలుపడం హాస్యాస్పదంగా ఉందని, మజ్లిస్ తహఫుజ్ ఖత్మేనబువ్వత్ రిలీజియస్ ట్రస్ట్ ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు, జమియాతుల్ ఉలేమా జిల్లా ఉపాధ్యక్షుడు ముఫ్తి ఘియాస్ మొహియుద్దీన్ అన్నారు. వక్ఫ్ సవరణ బిల్లుకు మద్ధతునిచ్చారని ఇస్లాంకు సంబంధం లేని ఖాదియాని అహ్మదియ్య వర్గానికి చెందిన వారితో కేంద్ర మైనార్టీ వ్యవహారాల శాఖ మంత్రి అంటకాగడం ముస్లిం సమాజాన్ని తప్పుదోవ పట్టించేందుకు పన్నిన కుట్రగా అభివర్ణించారు. శుక్రవారం నగరంలోని ఆ సంఘం జిల్లా కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో మాట్లాడుతూ, వక్ఫ్ బోర్డులో ఇతర మతాలకు చెందిన వారిని నియమించడం వెనుక ఆంతర్యమేంటో ప్రజలకు అర్థమైందన్నారు. ఇప్పటికైనా కేంద్రం తన విధానాలు మార్చుకోవాలని, లేని పక్షంలో దేశవ్యాప్త ఆందోళనలు చేపడుతామని హెచ్చరించారు. సమావేశంలో ముస్లిం నాయకులు రఫీయొద్దీన్, అక్తర్, ఇంజమాముల్ హక్, రహీంపాషా, సయ్యద్ బియాబానీ, అబ్బాస్‌తో పాటు పలువురు పాల్గొన్నారు.